వెంటాడుతున్న పశుగ్రాసం కొరత

- సత్వర చర్యలు చేపట్టిన ప్రభుత్వం
- పశు పోషకులకు సబ్సిడీపై దాణా

భీమవరం అర్బన్: ఈ ఏడాది ఎండలు తీవ్రంగా ఉండటం, వరి కోత యంత్రాలు ద్వారా మాసూళ్లు చేయడంతో ఎండు గడ్డి రాకపోకడం, రైతులు చేలల్లో మిగిలిన ఎండుగడ్డిన తగలబెట్టడంతో పశువులకు పశు గ్రాసం కొరత ఏర్పడుతుంది. రైతులు వ్యవసాయంతో పాటు ఆర్థిక పరిపుష్టి సాధించేందుకు పాడి పశువులను పెంచి పోషిస్తున్నారు. భీమవరం మండలంలో 11 వేల గేదెలు, 2 వేల ఆవులు పెంచుతున్నారు. అయితే వీటిలో అధిక ఆదాయాన్ని తెచ్చిపెట్టేది పాడి పరిశ్రమ. పశుపెంపకందారులతో పాటుగా రైతులు కూడా వీటిని పెంచి పోషిస్తున్నారు. సుమారు 17 వేల లీటర్లపైగా పాలు ఇతర ప్రాంతాలకు సరఫరా అవుతున్నట్లు ప్రాథమిక అంచనా. ఈ ఏడాది ఎండలు ఎక్కువగా ఉండటంతో పచ్చిక లేకపోవడంతో పశువులు పశుగ్రాసం కోసం అల్లాడిపోతున్నాయి. తీర ప్రాంత గ్రామాలలో ఉప్పు శాతం ఎక్కువగా ఉండటంతో పచ్చిక రాకపోకపోవడంతో పశు పెంపకం దారులు తమ పశువులను పోషించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కొంతమంది పశు పెంపకందా రులు తమ పశువులను అమ్మేందుకు సిద్ధమవుతున్నారు.


గునుపూడిలో కోతకోసినవరి చేలో మేస్తున్న పశువులు


చినఅమిరంలో పశువులకు సబ్సిడీపై దాణా అందిస్తున్న దృశ్యం

సబ్సిడీపై దాణా

పశుగ్రాసం కొరత తీర్చేందుకు ప్రభుత్వం సబ్సిడీపై దాణాను కేజీ రూ. 6.50కే పశు పెంపకం దారులకు అందిస్తున్నారు. అలాగే తొలకరి చినుకులు పడగానే సబ్సిడీపై గడ్డివిత్తనాలను పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో అందిస్తున్నారు.

పాడి పరిశ్రమను ఆదుకునేందుకు అనేక పథకాలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే పాడి పరిశ్రమను ఆదుకునేందుకు లీటర్‌కు రూ. 4 పెంచడమే కాకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ మహిళలకు సబ్సిడీపై పాడిపరిశ్రమ పెట్టుకునేందుకు రూ. 20 లక్షలు వరకూ సబ్సిడీపై రుణాలు, పాలవెల్లి ద్వారా పాలకేంద్రాలు ఏర్పాటు చేసి దళారులు, మధ్యవర్తులు వ్యవస్థ లేకుండా నేరుగా పశు పెంపకం దారులకే నగదు ఇవ్వడం, సబ్సిడీపై అజోలా అందివ్వడం, పశువులు మరణిస్తే బీమా ద్వారా రూ. 30 వేలు ఇవ్వడం తదితర పథకాలు ద్వారా పాడిపరిశ్రమ అభివృద్ధి చెందేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు తీసుకుంటున్నారు.

పశుగ్రాసం కొరత తీర్చేందుకు కృషి



ఈ ఏడాది ఎండా కాలంలో ఎండలు తీవ్రంగా ఉన్నా పశు గ్రాసం కొరత ఏర్పడుతుంది. ప్రత్యామ్నాయంగా రైతులు వరి చేలల్లో పిల్లి పెసర విత్తనాలు వేస్తే తొలకరి వర్షాలు పడగానే మొలకలు వస్తాయి. పశు గ్రాసం కొరత తీరుతుంది. అదే విధంగా దాణా ఆర్‌బీకే కేంద్రాల ద్వారా బుక్ చేసుకుంటే సబ్సిడీపై అందజేస్తాం. వర్షాలు పడగానే గడ్డి విత్తనాలు సబ్సిడీపై అందిస్తాం.

– పి.పుండరీబాబు, పశువైద్యాధికారి, గూట్లపాడు

బ్రేకర్ ఫట్... కరెంట్ కట్

ఐదు గంటలు విద్యుత్ నిలుపుదల


బ్రేకర్ కాలిపోవడంతో కొత్తది ఏర్పాటు చేస్తున్న ఏలూరు విద్యుత్ సిబ్బంది

ఆకివీడు: స్థానిక విద్యుత సబ్ స్టేషన్‌లో సాంకేతిక లోపంతో ఐదు గంటల పాటు విద్యుత్ సరఫరాను శుక్రవారం మధ్యాహ్నం నిలిపివేశారు. దీంతో సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందికి గురయ్యారు. పిల్లలు, వృద్ధులు అధిక ఉష్ణోగ్రతకు బెంబేలెత్తిపోయారు. ప్రజలు అల్లాడిపోయారు. గత వారం రోజుల క్రితం విద్యుత్ సబ్ స్టేషన్‌లోని 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌లో బ్రేకర్లు కాలిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. బ్రేకర్ల మరమ్మతుల్ని ఏలూరుకు చెందిన టెక్నికల్ సిబ్బంది మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. అయితే వారు వచ్చే సమయం వరకూ సరఫరాకు ఇబ్బంది లేకుండా నేరుగా విద్యుత్‌ను సరఫరా చేశారు. శుక్రవారం సిబ్బంది రావడంతో అప్పటికప్పుడు పనుల్ని ప్రారంభించారు. బ్రేకర్లు, ఇతరత్రా సాంకేతిక లోపాల్ని సరిజేశారు. దీంతో సాయింత్రం ఐదు గంటల ప్రాంతంలో సరఫరాను పునరుద్ధరించారు. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. సాంకేతిక లోపాన్ని సరిజేసేందుకు ఏలూరు సిబ్బంది వచ్చిన వెంటనే పనులు మొదలు పెట్టాల్సి వచ్చిందని ఏఈ ప్రసాదరాజు చెప్పారు. సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ముందుగా ప్రకటించడానికి ఏలూరు సాంకేతిక సిబ్బంది ఎప్పుడు వస్తారో తెలియక ప్రకటించలేదని వివరించారు. అసౌకర్యాన్నికి చింతిస్తున్నామని చెప్పారు.

సీఎం సహాయ నిధితో పేదకుటుంబాలకు మేలు


సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

కాళ్ల: సీఎం సహాయ నిధి వల్ల ఎన్నో పేద కుటుంబాలకు మేలు చేకూరుతుందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు తెలిపారు.కాళ్ల మండలం పెద అమిరంలోని వైఎస్సార్‌సీపీ క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని పాలకోడేరు మండలం గొరగ సమూడి గ్రామానికి చెందిన నూకపెయ్యి మరియమ్మకు రూ.60 వేల సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును పీవీఎల్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పెన్మత్స శ్రీనివాసరాజు, నాగేశ్వరరావు, గ్రామ సర్పంచ్ శివాజీరాజు తదితరులు పాల్గొన్నారు.

నాడు–నేడు పనులను పరిశీలించిన డీఈఓ


రాయకుదురులో నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న డీఈఓ వెంకటరమణ

వీరవాసరం: మండలంలోని రాయకుదురు ఉన్నత పాఠశాల కవురు వారి వీధి నెంబర్ వన్ పాఠశాలల్లో చేస్తున్న నాడు–నేడు పనులను డీఈఓ ఆర్.వెంకటరమణ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి నాడు–నేడు పనులు పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల ప్రారంభం రోజున జేవీకే కిట్లను విద్యార్థులకు అందించాలని, ప్రజాప్రతినిధులు, పేరెంట్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పండుగ వాతావరణం లో ఈ వేడుకను నిర్వహించాలని డీఈఓ సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచే విధంగా ఉపాధ్యాయులు తల్లిదండ్రులను చైతన్యపరచాలని ఆయన తెలిపారు . రాయకుదురు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు కె.వీరాస్వామి, ఎం.జయలక్ష్మి, కె.విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్స్ క్రమబద్ధీకరణపై హర్షం


ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలుపుతున్న కాంట్రాక్టు లెక్చరర్లు

సాక్షి, భీమవరం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పని చేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్స్‌ను క్రమబద్ధీకరిస్తూ రాష్ట్ర కేబినెట్ ఆమోదించడాన్ని హర్షం వ్యక్తం చేస్తూ కాంట్రాక్ట్ లెక్చరర్స్ సంఘం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపింది. సంఘం రాష్ట్ర కార్యదర్శి బీజే గాంధీ నేతృత్వంలో సంఘం నాయకులు ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను భీమవరంలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్స్‌ను 2014లోపు 5 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నవారిని రెగ్యులర్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్ట్ లెక్చరర్స్‌ను క్రమబద్ధీకరించడంతో ఎన్నో కుటుంబాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎల్ శ్రీనివాస్, రాజాజీ, రవి, సురేష్, మహంకాళీ తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరంలో డ్యాన్స్ పోటీలు


వైఎస్సార్ శాఖాగ్రంథాలయంలో డాన్స్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: పట్టణంలోని వైఎస్సార్ శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో శనివారం నృత్య పోటీలను డ్యాన్స్ టీచర్లు గుంటి ప్రభు, బి శ్యామల పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా రీడర్స్ ఫోరమ్ అధ్యక్షుడు అరసవల్లి సుబ్రమణ్యం, గ్రంతాలయాధికారి ఎస్ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా 34 రోజులపాటు బాలలకు వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చామన్నారు. వేసవి సెలవులను శిక్షణా తరగతుల్లో పాల్గొనడం ద్వారా బాలలు సద్వినియోగం చేసుకున్నారన్నారు. ఆదివారం గ్రంథాలయంలో శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ సబ్బి శివరామకృష్ణ పాల్గొని వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, పిల్లి మునలయ్య, ఎన్ లక్ష్మి, నరహరశెట్టి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి 11 సచివాలయాల్లో కంటి వెలుగు

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలోని 11 సచివాలయాల్లో సోమవారం మూడో విడత కంటి వెలుగు పథకంలో భాగంగా కంటి పరీక్షల నిర్వహణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కంటి వెలుగు డీపీఎంవో డాక్టర్ ఎస్.చందనప్రియాంక తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 60 ఏళ్లు దాటిన అవ్వాతాతాలకు కంటి స్క్రినింగ్ పరీక్షలు నిర్వహించి కళ్ల అద్దాలు,మందులు అందించడంతోపాటు, అవసరమైన వారికి ఆపరేషన్లు చేయిస్తాన్నారు. ఈక్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. సోమవారం ఆకివీడు మండలం అయిభీమవరం సచివాలయం,పోడూరు మండలం వద్దిపర్రు సచివాలయం, ఇరగవరం మండలం రేలంగి 4 బొప్పరాజు పాలెం, తాడేపల్లిగూడెం మున్సిపాలిటిలోని వాకర్స్ కాలనీ, మొగల్తూరు మండలం మొగల్తూరు 2 సచివాలయం, తాడేపల్లిగూడెం మండలం కొండ్రుప్రోలు సచివాలయం, పాలకొల్లు మున్సిపాలిటి వివర్స్ కాలనీ, పెనుమంట్ర మండలం పొలమూరు 1 సచివాలయం, గణపవరం మండలం పిప్పర 2 సచివాలయం, తణుకు మండలం వెల్పూరు 3 సచివాలయంలో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

భర్త దౌర్జన్యంపై భార్య ఫిర్యాదు

ఉండి: భర్త తీవ్రంగా కొట్టి, చంపుతానని బెదిరించిన ఘటనలో భార్య ఫిర్యాదుపై పోలీసులు భర్తపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కృష్ణా జిల్లా తిరువూరు శాంతినగర్‌కు చెందిన హెప్సీబాకు ఉండి మండలం మహదేవపట్నం గ్రామానికి చెందిన కోనాల శేఖర్‌తో 16 ఏళ్ల క్రితం వివాహమైంది. ఆమె తిరువూరు మున్సిపల్ కార్యాలయంలో క్లర్క్‌గా విధులు నిర్వర్తిస్తోంది. సాధారణంగా భార్యకు ఫోన్ చేసి మాట్లాడే భర్త గత పది రోజుల నుంచి ఫోన్ చేయకపోవడంతో ఈ నెల 8న భర్తను చూసేందుకు మహదేవపట్నం గ్రామానికి వచ్చింది. భర్త ఇంటి వద్ద లేకపోవడంతో అతనికి ఫోన్ చేయగా భీమవరంలో ఉన్నట్లు తెలుసుకుని అక్కడికి వెళ్లింది. అయితే భర్త అక్కడ లేకపోవడంతో మళ్లీ ఫోన్ చేయగా, తాను కాళ్ల మండలం కలవపూడిలో ఉన్నానని, అక్కడికి రావాలని భర్త చెప్పడంతో అక్కడికి వెళ్లింది. అక్కడ కూడా భర్త లేకపోవడంతో అదే రోజు రాత్రి 10.30 గంటలకు అత్తారింటికి చేరుకుంది. అక్కడే ఉన్న భర్త ఆమెను జుట్టు పట్టుకుని కాళ్లు, చేతులతో కొట్టి ఇక్కడ నుంచి వెళ్లిపోవాలని, లేకుంటే చంపుతానని బెదిరించి ఆమెను తీవ్రంగా కొట్టడంతో ఆమె భీమవరంలోని ఓ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతోంది. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు భర్తపై శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

21న తణుకులో సీపీఐ రాజకీయ శిక్షణ తరగతులు


సమావేశంలో మాట్లాడుతున్న భీమారావు

సాక్షి, భీమవరం: తణుకులో ఈనెల 21,22,తేదీల్లో నిర్వహించే సీపీఐ జిల్లా రాజకీయ శిక్షణా తరగతులు విజయవంతం చేయాలని ఆపార్టీ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కోరారు. శనివారం భీమవరంలో నిర్వహించిన సీపీఐ జిల్లా సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా స్థాయిలో రెండు రోజుల పాటు పార్టీ గ్రామ శాఖ కార్యదర్శులు, పట్టణ, మండల కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ, సమితి సభ్యులు, ప్రజా సంఘాల ముఖ్య నాయకులు శిక్షణా తరగతుల్లో పాల్గొనాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు టి.అప్పలస్వామి, బొద్దాని నాగరాజు, చెల్లబోయిన రంగారావు, కళింగ లక్ష్మణ రావు, నెక్కంటి క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణ పనుల పరిశీలన


అడవిపాలెంలో కల్వర్టు పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

యలమంచిలి: అడవిపాలెం గ్రామంలో పాలకొల్లు–దొడ్డిపట్ల ఆర్అండ్‌బీ రోడ్డును ఆనుకుని ఉన్న పల్లపు వీధి కల్వర్టు నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ పనులను శనివారం వైఎస్సార్ సీపీ నాయకులు తోట రామకృష్ణ, గంజి నరసింహారావు, సిర్రా నాగరాజులు పరిశీలించారు. పాలకొల్లు–దొడ్డిపట్ల ఆర్అండ్‌బీ రోడ్డును ఆనుకుని పల్లపు వీధి సుమారు నాలుగు అడుగులు పల్లంగా ఉంటుంది. కనుకనే ఈ వీధికి పల్లపు వీధి అనే పేరు వచ్చింది. వర్షాకాలం వచ్చిందంటే ఈ రోడ్డు పిల్ల కాలువ తలపిస్తుంది. ఆ సమయంలో ఈ వీధిలో నివసించే సుమారు 20 కుటుంబాల వారు అడుగు తీసి బయటపెట్టలేని దుస్థితి నెలకొంటుంది. దశాబ్ధాలు కాలంగా ఈ దుస్థితిని ఎవరూ తొలగించలేదు. ఇటీవల గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ ఈ ప్రాంతంలో పర్యటించినపుడు స్థానికులు తమ గోడు వెలబోసుకున్నారు. వెంటనే స్పందించిన ఆయన రోడ్డు నిర్మాణానికి జెడ్పీ నిధులు రూ.5 లక్షలు మంజూరు చేశారు. ఆ నిధులతో రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. అయితే ఈ రోడ్డు ప్రారంభంలో మురుగుబోదె ఉంది. ప్రస్తుతం ఆ బోది వద్ద పంచాయతీ నిధులు రూ.2 లక్షలతో కల్వర్టు నిర్మిస్తున్నారు. ఈ కల్వర్టు నిర్మాణం పూర్తయితే పల్లపు వీధి ప్రజలకు రోడ్డు సమస్య పూర్తిగా తొలగిపోతుంది.

గృహ నిర్మాణాలు వేగవంతం


ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న గృహనిర్మాణ శాఖ డీఈ రామాయణం త్రిమూర్తులు

యలమంచిలి: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలని గృహనిర్మాణ శాఖ డీఈ రామాయణం త్రిమూర్తులు కోరారు. హౌసింగ్ డే సందర్భంగా మేడపాడు గ్రామంలోని జగనన్న కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. జగనన్న కాలనీల్లో స్థలపూడిక జరిగి రోడ్లు, విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించామన్నారు. లబ్ధిదారులకు ఇల్లు త్వరగా నిర్మించుకుంటే బిల్లులు కూడా త్వరగా మంజూరు చేస్తామని త్రిమూర్తులు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు, స్థానిక సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ గుర్రాల వెంకట్రావు, ఎంపీటీసీ సభ్యులు దేగల సూర్యప్రభ, వైఎస్సార్ సీపీ నాయకులు దేగల వెంకటేశ్వరరావు, హౌసింగ్ ఏఈ రాజారామ్, ఆర్‌డబ్ల్యూఎస్ వర్క్ ఇన్‌స్పెక్టర్ కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పీవీఎల్‌ను కలిసిన జెడ్పీ చైర్‌పర్సన్


జెడ్పీ చైర్‌పర్సన్ దంపతులను సత్కరిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

కాళ్ల: డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజును ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ మర్యాదపూర్వకంగా కలిశారు. కాళ్ల మండలం పెదఅమిరం వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయానికి వచ్చేసిన ఆమె శనివారం పీవీఎల్‌ను కలిశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాళ్ల జెడ్పీటీసీ సభ్యుడు పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, ఎంపీపీ పెన్మత్స విశ్వనాధరాజు, కోపల్లె, కలవపూడి సొసైటీ అధ్యక్షులు వేగేశ్న జయరామకృష్ణంరాజు,పెన్మత్స దుర్గాప్రసాదరాజు, సాగిరాజు హరివర్మ తదితరు లు పాల్గొన్నారు.

వేగంగా అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు


కోమటిగుంటలో వేగంగా అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులు నిర్వహిస్తున్న దృశ్యం

కాళ్ల: మండలంలోని కోమటిగుంటలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు వేగంగా జరుగుతున్నాయని గ్రామ సర్పంచ్ బోనం భాగ్యశ్రీశివ కుమార్ తెలిపారు.నిర్మాణ పనులను శనివారం పరిశీలించారు. మండల పరిషత్ నిధులు రూ.2 లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ 50 మీ.మేర చేపట్టినట్లు తెలిపారు. గ్రామంలోని మహంకాళమ్మ గుడి వద్ద నుంచి మురుగుకాల్వ వరకు డ్రెయినేజీ పనులు చేపట్టినట్లు ఆమె స్పష్టం చేశారు.ఈ పనులను వైఎస్సార్‌సీపీ నాయకులు బోనం శివకుమార్ తదితరులు పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న ఆభరణాల ప్రదర్శన



బీఎన్ఆర్ గోల్డ్ అండ్ డైమండ్స్ ఆధ్వర్యంలో ఆభరణాల ప్రదర్శనను ప్రారంభిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: పట్టణంలోని ఆనంద్ ఇన్‌లో విజయవాడకు చెందిన బీఎస్ఆర్ గోల్డ్ అండ్ డైమండ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆభరణాల ప్రదర్శన పట్టణ ప్రజలను ఆకట్టుకుంది. ప్రదర్శనను ప్రారంభించిన కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ బి.రోహిత్ రెడ్డి మాట్లాడుతూ మహిళల అభిరుచికి తగ్గట్టుగా పెద్ద ఆభరణాలు ఆ ప్రదర్శనలో ఏర్పాటు చేశామన్నారు. డైమండ్, పోల్కీ, విక్టోరియల్ జ్యూయలరీ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. బంగారు ఆభరణాలపై 50 శాతం తరుగు, వీఏ తగ్గింపు ఉంటుందన్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకూ ఈ ప్రదర్శన ఉంటుందని రోహిత్ రెడ్డి తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

పాలకోడేరు: విధులు నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు బాధ్యతల నుంచి తాత్కాలికంగా తొలగిస్తున్నట్లు పాలకోడేరు గ్రామ పంచాయతీ నందు క్షేత్ర సహాయకునిగా పనిచేస్తున్న యర్ర దేవికి జిల్లా నీటి యాజమాన్య సంస్థ నోటీలు జారీ చేసింది. ఈ మేరకు ఆ సంస్థ పథక సంచాలకు ఎస్‌టీ వి రాజేశ్వరరావు సంజాయిషీ నోటీసు జారీ చేశారు. సుపరిపాలనలో భాగంగా వర్క్ ఫైల్స్ పూరి చేయకపోవడం, రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడం పలు మార్లు ఉన్నతాధికారులు ఆదేశాలను దిక్కరించడం, మహాత్మాగాంధీ ఉపాధి పథకంలో హాజరయ్యే కూలీలకు సరైన సామాగ్రి, మౌలిక సదుపాయాలు కల్పించండంలో విఫలమవడంతో తాత్కాలికంగా విధులు నుంచి తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు. వారం రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని లేని ఎడల ఆరోపణలు రుజువు అయినట్లు భావించి తదుపరి చర్యలు తీసుకుంటామని నోటీసులో హెచ్చరించారు.

భార్యాభర్తల వివాదంలో వ్యక్తికి గాయాలు

పాలకోడేరు: భార్యాభర్తల తగవులో అడ్డు వెళ్లిన వ్యక్తిని కర్రతో కొట్టగా తల పగిలి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు వివరాల ప్రకారం మోగల్లు వడ్డీల వీధిలో కాపురం ఉంటున్న భలే పరాలు శుక్రవారం రాత్రి తన భార్యతో గొడవ పడుతుండగా సర్ది చెబుదామని పక్కింటి వ్యక్తి బలే తాతయ్య వెళ్లగా పరాలు కర్రతో కొట్టగా తాతయ్య తల పగిలి తీవ్ర రక్తస్రావం కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై డీ.వీ.వీ.శ్రీనివాస్ తెలిపారు.

ఓఆర్ఎస్‌పై అవగాహన

పోడూరు: పెనుమదం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఓఆర్ఎస్ ద్రావణంపై గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు, స్థానిక ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఎస్ఎం పి.సుబ్బాయమ్మ ఓఆర్ఎస్ ఉపయోగాలను వివరించారు.

రేపటి నుంచి ఉచిత కుట్టుశిక్షణ

సాక్షి, భీమవరం: వసుధఫౌండేషన్ ఆధ్వర్యంలో భీమవరం పట్టణంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ, పెయింటింగ్, ఎంబ్రాయిడరీ నేర్పించనున్నట్లు వసుధా ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు శనివారం విలేకరులకు చెప్పారు. టుటౌన్ శ్రీరాంపురంలోని గాంధీ కస్తూరిబా భవనంలో సోమవారం నుంచి ఉచిత శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. వివరాల కోసం 86397 30222 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనలు


విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని పేరుపాలెం నార్త్ పంచాయతీ ఏటిపార, ఇంజేటివారిపేటలో శనివారం ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారి వాణి ట్రస్టు అందించిన రూ.10 లక్షల ఆర్థిక సహాయంతో శ్రీకుంతీ మహేశ్వరి గొంతేలమ్మ, నంది విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన పొలపర్తి శ్రీను,విజయమణి, ఇంజేటి సోమేశ్వరరావు, ఆదిలక్ష్మి,పొలపర్తి నాగరాజు, కనకమహలక్ష్మి దంపతులతో కోసూరి శ్రీనివాసాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం విగ్రహప్రతిష్ఠాపన చేయించారు. అనంతరం వీరబ్రహ్మం సిద్ధాంతి ఆర్థిక సహాయంతో అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పేరుపాలెం వెంకన్న, ఆర్ఎస్ఎస్ గోదావరి విభాగ్ సంఘ చాలక్ మంతెన రామచంద్రరాజు, నాయకులు సక్కా రామోజీ, మన్నే కుమార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.